ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి, నాయకులు నిర్మల, నారయణ

కలుషిత తాగునీటి వల్లే...

- లక్ష్మీపురంలో డయేరియా విజృంభణ - మంచం పట్టిన వంద మంది

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లక్ష్మీపురంలో డయేరియా విజృంభించింది. ఆదివారం సాయంత్రం గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన కొందరు చిన్నారులు, వృద్ధులు, యువకులు డయేరియా బారిన పడ్డారు. డయేరియా వచ్చిన వారు నీరసంగా కదలలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో వెంటనే గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సహకారంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు, ఉలిందకొండ పిహెచ్‌సిలో మరికొందరు, గ్రామం ఊరి వాకిలి వద్ద ఉన్న సబ్ సెంటర్‌లో మరికొందరు చికిత్స పొందుతున్నారు. గ్రామంలోనే చికిత్స పొందుతున్న వారు కోలుకోలేకపోతుండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు జిజిహెచ్‌లోని పిల్లల వార్డులో డయేరియా చిన్నారులు చికిత్స పొందుతున్నారు. బాధితులు కోలుకున్న తర్వాత ఇంటికి పంపిస్తున్నారు. లక్ష్మీపురం గ్రామంలోని మురుగు నీరు అంతటిని హంద్రీ నదిలోకి డిస్పోజల్ చేస్తున్నారు. మురుగునీరు డిస్పోజల్ అవుతున్న ప్రాంతంలోనే తాగునీటి బోరు బావి ఉంది. మురుగునీరు మొత్తం రింగ్ బావి వద్దనే ఇంకిపోవడంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఇలా కలుషితం అవుతున్న తాగునీరు వినియోగిస్తున్న ప్రజలు ప్రధానంగా బీసీ కాలనీ ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఒక్కొక్క ఏరియాకు ఒక్కొక్క తాగునీటి పైప్లైన్‌ను వేశారు. బీసీ కాలనీకి వేసిన తాగునీటి పైప్‌లైన్ ఉన్న రింగ్ బావి వద్దనే గ్రామంలోని మురుగునీరు వచ్చి చేరుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని గత 15 ఏళ్ల నుంచి అధికారులకు ప్రజా ప్రతినిధులకు గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నా పెడచెవిన పెడుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత కూడా తాగునీటి సమస్య పరిష్కరించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం ఆదాయ వనరుల కోసమే గ్రామపంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కానరాని ప్రత్యేక చర్యలు

రెండు రోజులుగా డయేరియా వ్యాప్తి చెందుతున్నా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టలేదు. కేవలం బాధితులకు గ్లూకోస్ బాటిల్స్ ఎక్కించడం తప్ప మెరుగైన వైద్య సేవలు అందించడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రారంభంలో ఆసుపత్రిలో చేరిన బాధితులు డిశ్చార్జ్ ఇంటికి వెళ్ళిన తర్వాత మరుసటి రోజు ఉదయం మళ్లీ డయేరియా బారిన పడడంతో బాధితురాలు బంధువులు మళ్లీ వైద్య చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తున్నారు. ఈ విధంగా సుమారు పది మంది బాధితులకు రెండో సారి డయేరియా వచ్చిందని బంధువులు చెబుతున్నారు.

తాగునీటి కలుషితాన్ని అరికట్టాలి

- లింగేశ్వరయ్య, లక్ష్మీపురం గ్రామం

గ్రామంలో ప్రజలందరికీ హంద్రీ నదిలోని రింగ్ బావి నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నారు. గ్రామం నుంచి వచ్చే మురుగునీరు రింగ్ బావి వద్దకు చేరుకుని ఇసుకలోకి ఇంకిపోతున్నాయి. ఇలా తాగునీరు కలుషితం అవుతోంది. ఈ నీటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలకు అనేక రోగాలు వ్యాపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సరఫరా చేసే రింగ్ బావి వద్దకు మురుగునీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలి.

అధికారుల నిర్లక్ష్యంతోనే అతిసార

- సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే లక్ష్మీపురంలో అతిసార ప్రబలి వందలాది మంది ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, కెవి నారాయణ విమర్శించారు. కర్నూలు జిజిహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధితులను సోమవారం వారు పరామర్శించారు. లక్ష్మీపురం గ్రామపంచాయతీ నుండి కార్పొరేషన్‌లోకి విలీనమైన తర్వాత ఆ గ్రామ ప్రజలకు ఒరిగింది శూన్యమని విమర్శించారు. లక్ష్మీపురం గ్రామాన్ని రాజకీయ అవసరాల కోసం విలీనం చేసిన వారు ఆ గ్రామ సంక్షేమంను గాలికి వదిలేసారన్నారు. ఇప్పటి వరకు శుభ్రమైన త్రాగునీరు అందించే పరిస్థితి లేదని, దానివల్ల హంద్రీ నదిలో కలుషిత నీరు ఆ గ్రామ ప్రజలు తాగి అస్వస్థతకు లోనయ్యారని తెలిపారు. గ్రామ ప్రజలు గత మూడు రోజుల నుండి మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పలకరించే నాథుడు లేడని, హంద్రీలో ఇసుక తవ్వడం వల్ల అక్కడున్న బోరుబావిలో కలుషితమైన ఆ నీటిని ప్రజలు తాగడం వల్ల వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు గానీ, నగర పాలక అధికారులు గానీ స్పందించకపోవడంతో ఇంతమంది అస్వస్థకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కర్నూలు నగరం నుండి ఫిల్టర్ వాటర్ లక్ష్మీపురానికి సరఫరా చేయాలని, అస్వస్థతకు లోనైన ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో బాధితులకు పరామర్శ

అతిసారతో బాధితుల్లో లక్ష్మీపురం ఆరోగ్య ఉప కేంద్రంలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం మండల కార్యదర్శి మధు, మాజీ ఎంపీటీసీ బి.ఆంజనేయులు పరామర్శించారు. ఇప్పటికే రెండుసార్లు ఆ గ్రామంలో ప్రజలు అతి సార బారిన పడి అనారోగ్యం పాలయ్యారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు గానీ, కార్పొరేటర్‌కు గానీ ప్రజా సంక్షేమం పట్టడం లేదన్నారు. గ్రామంలో డ్రైనేజీలు ఏర్పాటు చేసి మురుగునీరుని వంకలోకి కలపాలని, మున్సిపల్ కార్పొరేషన్ నీటిని లక్ష్మీపురం ప్రజలకు అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ గౌడ్, ఆకే పోగు ఆంజనేయులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

- క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రారంభం
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. యువతలో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. గ్రామ, వార్డు స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో అనే ఐదు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యోగా, టెన్నికాయిట్, మారతాన్ క్రీడల్లో కూడా పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రారంభం అయిందన్నారు. 15 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు ఈ క్రీడల్లో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మీ సమీపంలో ఉన్న గ్రామ, వార్డ్ సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందచేస్తామని, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో నగదు బహుమతులను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆడుదాం ఆంధ్రా మాస్కట్ (లోగో)ను ఆవిష్కరించారు. క్రీడా పరికరాలను ప్రదర్శించారు. సెట్కూరు సిఇఒ రమణ, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, కోచ్ లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందన

శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన 10వ ఎపిస్టేట్ సీనియర్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ క్రీడల పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు బి.వీరేష్, డిజి. వీరేష్, అబ్దుల్లా, నరసింహనాయక్, పర్వేజ్ ముషారఫ్, బి.నాగమణిలను కలెక్టర్ అభినందించారు.

నిర్లక్ష్యం ఖరీదు నాలుగు ప్రాణాలు

- ఆ చావులకు కారకులు ఎవరు? - హైవే నిర్మించారు... విద్యుత్ దీపాల ఏర్పాట్లను మరిచారు - అంధకారంలో ఎన్‌హెచ్ 44 కృష్ణానగర్ హైవే బ్రిడ్జి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

హైవే బ్రిడ్జి నిర్మాణంలో హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యానికి అంతులేకుండా పోతుంది. బ్రిడ్జి నిర్మాణంలో అధికారుల అరకొర పనుల ఫలితంగా అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. పనులు పూర్తయి ఏకంగా ఏడాది గడిచినా హైవేపై విద్యుత్ దీపాల ఏర్పాటను అధికారులు విస్మరించారు. దీంతో హైవే అంధకారంలో కూరుకుంది. ఫలితంగా అమాయకులైన వాహనదారులు చీకటిలో ప్రమాదాలకు గురై అసువులు బాస్తున్నారు. కర్నూలు నగరంలోని కృష్ణానగర్ మీదుగా వెళుతున్న ఎన్‌హెచ్ 44 బ్రిడ్జి పనులు ఏడాది క్రితం పూర్తయ్యాయి. హైవే భద్రత దృష్ట్యా బారికేడ్లు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మాణం షరీఫ్‌నగర్ నుండి ప్రారంభమై రాఘవేంద్రనగర్‌లోని రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు చేపట్టారు. కాగా విద్యుత్తు స్తంభాలను ఏర్పాటుచేసినప్పటికీ చాలాకాలంగా ఏ ఒక్క విద్యుత్తు దీపం ఇక్కడ వెలగకపోవడం గమనార్హం. దీంతో హైవే బ్రిడ్జి మొదలు తుది వరకు అంధకారం అలుముకొని ఉంది. ఈ నేపథ్యంలో వాహనదారులు సరైన వెలుతురు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతోపాటు హైవేపై ఏర్పాటుచేసిన మీడియన్ ఓపెన్‌గా ఉండడం వల్ల స్థానిక ప్రజలు తమ అవసరాల కోసం రోడ్డును దాటే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల కూడా ప్రమాదం పొంచి ఉంది. తెరిచి ఉన్న మీడియన్ను మూసివేసి దాని ఎత్తును కూడా పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఏడాదిలో నలుగురి ప్రాణాలు గాల్లోకి

హైవే బ్రిడ్జిపై విద్యుత్ దీపాలు లేని కారణంగా కేవలం ఏడాది కాలంలోనే మూడు ప్రమాదాలు జరగడంతో నలుగురు అమాయకులు ప్రాణాలను కోల్పోయారు. ఈ ఏడాది మార్చిలో సరిగ్గా ఇదే ప్రాంతంలో ఒక మహిళ వాహనం ఢీకొని మృతి చెందింది. కొద్దిరోజుల క్రితంఇదే ప్రాంతంలో ఆటో డ్రైవర్‌ను వాహనం ఢీకొని మృతి చెందాడు. ఇటీవల శరీన్ నగర్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన ఇద్దరు వృద్ధ దంపతులను మోటార్ బైకు ఢీకొనడంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హైవే అధికారులపై కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అనేకమంది ప్రమాదాలకు గురై గాయాల పాలైన ఘటనలు అనేకం ఉన్నట్లు సమాచారం.

అధికారుల నిర్లక్ష్యం పై మండిపడుతున్న స్థానికులు

అధికారులు హైవే నిర్మాణ పనుల్లో చెబుతున్న నిర్లక్ష్యంపై స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలాకాలంగా లైట్లు వెలగడం లేదని తద్వారా అమాయకమైన ప్రజలు ప్రమాదాలకు గురై కళ్ళముందే కాలం చేస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

హైవే అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్ హెచ్ 44 కృష్ణానగర్ హైవే బ్రిడ్జిపై విధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలకు కోల్పోతున్నారు. ఇది హైవే అధికారుల నిర్లక్ష్యం. దీనికి ఆ శాఖ అధికారులే బాధ్యత వహించాలి. వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి.

- టి రాముడు న్యూ సిటీ కార్యదర్శి, సిపిఎం, కర్నూలు.

హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఎన్ హెచ్ 44 హైవే పై చాలాచోట్ల బారికేడ్లను ఏర్పాటు చేయడం కోసం గతంలో వెంటపడ్డాం. అనంతరం అధికారులు ఏర్పాటు చేశారు. దీపాల ఏర్పాటు గురించి కూడా వారి దృష్టికి తీసుకెళ్తాం. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- శ్రీధర్, డిటిసి, కర్నూలు జిల్లా

సమావేశంలో మాట్లాడుతున్న కెంగార మోహన్

పాఠశాలల మూసివేతకు కారకులెవరో తేల్చాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యారంగానికి పెద్దపీఠవేశామని చెబుతున్న ప్రభుత్వం గత నాలుగేళ్ళలో 4709 పాఠశాలలు ఎలా మూతబడ్డాయో సమాధానం చెప్పాలని, ప్రభుత్వపాఠశాలలను మూసేసి కార్పోరేట్లకు పరోక్షంగా రెడ్ కార్పేట్లను పరుస్తోందని సాహితీస్రవంతి రాష్ట్రఅధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. సోమవారం కెకె భవన్‌లో క్రిష్ణగిరి యుటిఎఫ్ జిల్లా నాయకులు యుఆర్‌ఎ. రవి కుమార్ అధ్యక్షతన జరిగిన తొలి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించడం పరిష్కారం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయపోస్టులను భర్తీచేయడం ద్వారానే ప్రభుత్వ బడుల మనుగడ సాధ్యమన్నారు. మానవ వనరుగా పేర్కొనే విద్యలో సంస్కరణల పేరుతో విద్యారంగం నిర్వీర్యమైందన్నారు. ఉద్యోగులకు గుదిబండగా మారిన సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తెచ్చి మోసం చేసిందన్నారు. హక్కులు-బాధ్యతలు రెండుకళ్ళుగా యుటిఎఫ్ పోరాటాలు చేస్తున్న సందర్భంలో మరింత ఉద్యమస్ఫూర్తితో ప్రభుత్వం మెడలు వంచేలా ఉద్యమప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. క్రిష్ణగిరి మండల అధ్యక్షకార్యదర్శులు రామ్మూర్తి, నాగరాజు, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, శేషారెడ్డి, దొంతుల రాములు, నవీన్ పాటి, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

గంట వ్యవధిలో అన్నాతమ్ముడు మృతి

ప్రజాశక్తి- సి బెళగల్ : సి.బెళగల్‌లో దళితవాడలో గంట వ్యవధిలో అన్న తమ్ముడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. చెప్పుల మారెప్ప (65) ఉబ్బస వ్యాధి తీవ్రతతో ఆసుపత్రికని కర్నూలుకు బయలుదేరారు. నాగలాపురం చేరుకోగానే ఆకస్మికంగా మృతి చెందాడు. అనారోగ్యంతో ఉన్న మారెప్ప అన్న తిమ్మప్ప (70) తమ్ముడి మరణవార్త విని తుదిశ్వాస విడిచాడు. ఇలా గంట వ్యవదిలోనే అన్న తమ్ముడు మృతి గ్రామాన్ని కలచివేసింది.

'నారాయణ సిఇఒను అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : నారాయణ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కర్నూలు సిఇఒ లింగేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం జాయింట్ కలెక్టర్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా ,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్ ,డివైఎఫ్ఐ నాయకురాలు శిరీషలు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు ఎన్నో కట్టుదిట్టమైన చట్టాలు తెస్తూ వాటిపై అవగాహన కల్పిస్తున్నా ఎక్కడా కూడా మహిళలపై , అమ్మాయిలపై ఈ లైంగిక వేధింపులు ఆగడం లేదన్నారు. నారాయణ కాలేజీల సిఇఒ మహిళా ఉద్యోగులను, విద్యార్థులను గైడ్‌లైన్స్ పేరుతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారన్నారు. క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు

సెన్సార్ సిసి కెమెరాల జరిమానాలు ఆపండి

రవాణా శాఖ కార్యాలయం ఎదుట పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆర్‌టిఒ పోలీసుల జరిమానాలే కాకుండా పట్టణ ప్రజలపై సెన్సార్ సిసి కెమెరాల ద్వారా కూడా జరిమానాలను విధించి భారాలను మోపటాన్ని ఆపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి, లాంగ్‌లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పి.మినల్లా, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.అన్వర్‌బాష అన్నారు. వాహనదారులపై వేస్తున్న జరిమానాలను వ్యతిరేకిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లారీ యజమానులు, టాక్టర్ యజమానులు, లైట్ వెహికల్స్ యజమానులు, డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ లేని కూడళ్లలో సెన్సార్ సిసి కెమెరాలు అమర్చి పచ్చ లైట్‌పడ్డా ఫైన్‌కట్టాలంటూ నోటీసులు, వాహనయజమానులకు పంపుతున్నారని, ఇది సరికాదని ఆవేదనను వ్యక్తం చేశారు. సెన్సార్ కెమెరాలను తొలగించి జరిమానాలను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. ఒకపక్క ట్రాఫిక్ పోలీసులు మరో పక్క ఆర్‌టిఒ అధికారులు, ఇది చాలదన్నట్లు సెన్సార్ సీసీ కెమెరాలు ద్వారా వేస్తున్న జరిమానాలను వేస్తున్నారని, ఈ వేధింపుల్ని భరించలేం మా బతుకులు మమ్మల్ని బతకనీయాలని కోరారు. డీజిల్ పెట్రోల్ రేట్లతో పాటు రోడ్డు టాక్సులే చెల్లించలేక అప్పులపాలౌవుతుంటే ట్రాఫిక్ లేని కూడళ్లల్లో కూడా సెన్సార్ సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజు అనవసరంగా జరిమానాలు వేస్తున్నారని అన్నారు. పచ్చ లైట్ వెలిగేటప్పుడు రోడ్డు కూడలి దాటిన ఫైన్ కట్టాలంటూ నోటీసులు వస్తున్నాయన్నారు. సెన్సార్ కెమెరాలను తొలగించి వాటి ద్వారా వచ్చిన జరిమానా నోటీసులను రద్దు చేయాలని, రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా వినతి పత్రం తీసుకున్న రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలన్నీ వదిలేసామని తాము జరిమానాలు వేయడం లేదని చెప్పారు. వెంటనే మీ శాఖ పేరుతోనే నోటీసులు ఎందుకొస్తున్నాయని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి జరిమానాల భారం పడకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈధర్నాలో కె.రంగస్వామి, ఎస్.హాఫీజ్ బై, పల్సర్‌బాష, ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు, ఎస్. సెమీ ఉల్లా, సోము, మధు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

దళితుల రచ్చకట్టను కూల్చిన వారిపై కేసు పెట్టాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్రిష్ణగిరి మండలం ఎరుకల చెరువు గ్రామంలో దళితుల రచ్చకట్టను కూల్చిన నాగేంద్ర, రమేష్ లపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎరుకల చెరువు గ్రామ దళితులతో ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. పెద్ద బాబు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, మాట్లాడుతూ.. ఎరుకల చెరువు గ్రామంలో గత 8 నెలల క్రితం మాదిగలు అన్ని రకాల క్రతువులకు ఉపయోగించుకునే రచ్చకట్టను కట్ట వెనక ఇల్లు ఉన్న నాగేంద్ర, రమేష్ లు మాదిగలు మా ఇంటి ముందు కూర్చుంటారా అనే కుల దురహంకారంతో కూలుస్తుంటే పెద్దలు, పోలీసుల సహకారంతో ఆపారన్నారు. ఎనిమిది నెలలుగా సమస్యను ఎటు పరిష్కరించకపోవడంతో గత నాలుగు రోజుల క్రితం సంపూర్ణంగా కట్టను కూల్చి పునాదులు తవ్వి ఇల్లు కట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాగేంద్ర రమేష్‌లు కులదురహంకారంతో రెచ్చిపోతున్నారన్నారు. నాగేంద్ర, రమేష్ లను అరెస్టు చేయడంతో పాటు, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని డిఆర్‌ఒను బయటికి పిలిపించారు. సమస్యను విన్న డిఆర్‌ఒ మధుసుదన్ రావు మాట్లాడుతూ వెంటనే ఎంఆర్‌ఒతో విచారణ చేయించి రచ్చ కట్టను అక్కడే నిర్మించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.గురుస్వామి, ఎం.భాస్కర్, జిల్లా నాయకులు ఏసు రాజు, కెవిపిఎస్ మండల నాయకులు పరుశరాముడు, రాజు, గ్రామ పెద్దలు అయ్యన్న, రామన్న, లక్ష్మన్న, గోయిందు, ఏహోబు, తిప్పన్న, సురేష్, చిన్న గిడ్డయ్య, గంగన్న, నడిపి మాదన్న, దానమయ్య, వెంకటేశ్వర్లు, దస్తగిరి, కమల్ కుమార్, ఆటోరాజు, వెంకటేశ్వరమ్మ, రత్నమ్మ, మార్తములతోపాటు మరో 87 మంది పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎండి.ఆనంద్‌బాబు

3న తాడేపల్లిగూడెంలో రజకుల గర్జన సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డిసెంబర్ 2, 3, 4, తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో జరిగే రజకుల అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్ కోరారు. కర్నూలు కార్మిక కర్షక భవనం సంఘం కార్యాలయంలో రజక వత్తిదారులతో కలిసి కరపత్రం విడుదల చేశారు. గురుశేఖర్, కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి సి. శేషాద్రి మాట్లాడుతూ సమాజంలో రజకుల పట్ల నేటికీ కుల వివక్ష కొనసాగుతుందన్నారు. గడిచిన నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదన్నారు. రజకుల పైన దాడులు సాంఘిక బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ లాగా సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఈ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. వృత్తికి ఆధారమైన చెరువులపై పూర్తి హక్కు రజకులకు కల్పించాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్, గురుకుల పాఠశాలలో,దేవాలయాల్లో, ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇస్త్రీ చేస్తున్న రజక వృత్తిదారులకురూ. 250 యూనిట్లు ఉచిత విద్యుత్తు తెలంగాణ గవర్నమెంట్ ఇచ్చిన విధంగా ఇవ్వాలన్నారు. డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో జరిగే రజక చైతన్య తరగతుల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. గర కమిటీ సభ్యులు కర్రెన్న, నాయకులు నాగరాజు, అంజి, ఈరన్న, జమ్మన్న, పెద్ద జమ్మన్న, బాబు, మధు, పుల్లయ్య, రాముడు, శ్రీరాములు పాల్గొన్నారు.

స్పందనలో వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

విచారించి చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్‌పి

స్పందనకు 93 ఫిర్యాదులు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందనకు ఈ రోజు మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారించి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసులు , లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికుల అటెండెన్స్ మస్టర్ విధానాన్ని పాత (మున్సిపల్ ఆవరణలో నీళ్ల ట్యాంకు దగ్గర) స్థానంలోనే కొనసాగించాలని, ఎంఐజి కాలనీలో నీళ్ల ట్యాంకు దగ్గర మస్టర్ విధానం పెట్టడం వల్ల కార్మికులకు ఆర్థిక భారం పెరిగిందని తెలిపారు. మస్టర్ విధానం కోసం ఎక్కువ సమయం పడుతోందని, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాత మస్టర్ స్థానంలోకి మార్చాలని కోరారు. ఎఇ, డిఎంఇ ఫిట్టర్ల ఇంజినీరింగ్ వర్కర్లపై వేధింపులను ఆపాలన్నారు. యూనిఫారం, పనిముట్లు, సబ్బులు, పరికరాలు ఇవ్వాలని, వారానికోసారి వీక్లి ఆఫ్ ఇవ్వాలని కోరారు. కార్మికుల అత్యవసర పరిస్థితుల్లో ఎఇ, డిఎంఇలు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ సెలవులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారన్నారు. ఎఇ ద్వారానే సెలవులు ఇవ్వాలన్నారు. వర్కర్ చనిపోతే మట్టి ఖర్చులకు కుటుంబ సభ్యులకు డబ్బులు ఇచ్చి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కుటుంబంలో ఒకరిని ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ సహాయ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, అర్చకులు శివన్న, నాగరాజు స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.1.28 కోట్లతో గ్రానైట్ బండ పరుపు పనులు, అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. రాజగోపురం నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు వివరించారు. దేవాలయం ముందు భాగంలో సిసి రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులతో చర్చించారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేదుకు కృషి చేయాలన్నారు. అనంతరం సులేకేరి గ్రామ సమీపంలో వెలసిన శ్రీబుడుముల దొడ్డి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. దేవాలయ సూపరింటెండెంట్లు వెంకటేష్, రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, వైసిపి నాయకులు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, దోశల అయ్యప్ప, బండకుంట సర్పంచి గోపాల్ రెడ్డి, అవతారం, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

సహాయ కమిషనర్ వాణితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాగునీరందించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతి గ్రామానికీ తాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నహరివాణం గ్రామ సమీపంలో రూ.6 కోట్లతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులోకి ఎల్ఎల్‌సి నుంచి తాగునీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. కొత్తగా నిర్మించిన ఈ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి మదిరె, పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయని చెప్పారు. తాగునీటి కొరత లేకుండా త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మరికొన్ని గ్రామాలకు కూడా త్వరలోనే ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శివనాగేశ్వరరావు, ఎఇ నాగమల్లయ్య, విద్యుత్ శాఖ ఎఇ చెన్నయ్య, మాజీ జడ్‌పిటిసి ఆనంద్, మాజీ ఎంపిపి పంపాపతి, వైసిపి పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైసిపి మండల అధ్యక్షులు గురునాథ్ రెడ్డి, అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డి, మదిరె మాజీ సర్పంచి చంద్రశేఖర్ రెడ్డి, పెద్దహరివాణం, మదిరె సర్పంచులు రాము, నారాయణ, భీమేష్, రామకృష్ణారెడ్డి, మెడికల్ నాగరాజు, వీరేష్, లింగన్న, ఉల్తేప్ప పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులో తాగునీటి పంపింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు

- ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి టి.బాలన్న తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిప్పగిరి, నేమకల్లు, ఏరూరు, నగరడోనా, రామదుర్గం, బంటనహాల్ తదితర గ్రామాల్లో పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఎంపిడిఒ సివి.కొండయ్య ఆధ్వర్యంలో అభివృద్ధే ధ్యేయంగా గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో 'గడపగడపకు' నిధులతో డ్రెయినేజీలు ఏర్పాటు చేయించి, పారిశుధ్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నేమకల్లు గ్రామంలో రాంపురమయ్య వీధిలో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులందరూ గ్రామాల్లో మురుగుకాలువలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారన్నారు.

రాష్ట్రస్థాయికి పెద్దతుంబలం విద్యార్థిని

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో ఉన్న నేషనల్ స్కూల్ విద్యార్థి స్వప్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. గుంటూరులో ఈనెల 26 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుని అభినందించారు.

ఎస్ఐ ఓబులేసు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు పోలీసు స్టేషన్‌కు ఎస్ఐగా హెచ్.ఓబులేసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువా అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ... ఆలూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని తెలిపారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ఉన్నారు.

మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్ఐ

'ప్రజలకు అండగా వైఎస్ఆర్ బీమా'

ఆస్పరి : రాష్ట్ర ప్రజలకు వైఎస్ఆర్ బీమా పథకం అండగా నిలుస్తోందని జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్ తెలిపారు. సోమవారం ఆస్పరిలో నజీర్ మహ్మద్ (46) మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా వర్తింపజేయడంతో తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు. మిగతా రూ.90 వేలు కుటుంబ ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. వైసిపి నాయకులు తిమ్మప్ప, సచివాలయ కన్వీనర్ కృష్ణారెడ్డి, రంగన్న, మహానంది, శివ, లక్ష్మన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

సంపులో నీరు కలుషితం కాకుండా చూడాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఎంఐజి కాలనీలోని తాగునీటి సంపునకు పైకప్పు, ప్రహరీ నిర్మించి, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీనియర్ నాయకులు ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో స్పందనలో కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంపు పైభాగం సగం మరమ్మతులకు నోచుకోక ఓపెన్‌గా ఉండడంతో వ్యర్థాలు పడి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఇటీవల పెద్దహరివాణం గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకు రక్షణ గోడ లేకపోవడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంపు పైభాగం ఓపెన్‌గా ఉండడం వల్ల రాంజల దగ్గర ఫిల్టర్ చేసిన నీరు ఇక్కడికి చేరినప్పటికీ, దుమ్ము, ధూళి, కోతులు, కుక్కలు, పందులు, పక్షులు లాంటివి సంపులో పడే అవకాశం ఉందన్నారు. ఈ నీటినే ట్యాంకుకు ఎక్కిస్తూ వార్డులకు సరఫరా చేస్తున్నారన్నారు. ఈ నీటిని తాగి ప్రజలు రోగాలబారిన పడే అవకాశముందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సంపునకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేసిన వైసిపి

- టిడిపి సీనియర్ నాయకులు నాగరాజ్ గౌడ్, గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని, అర్థం పర్థం లేని షరతులతో విద్యార్థులకు రావాల్సిన పథకాల్లో కోత విధిస్తోందని, పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నాయకులు మండిపడ్డారు. సోమవారం నందవరంలోని టిడిపి కార్యాలయంలో 'విద్యార్థి మేలుకో.. భవిష్యత్తును కాపాడుకో' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు నాగరాజ్ గౌడ్, గురురాజ్ దేశాయ్, చిన్న రాముడు, బండే గురు స్వామి మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పి గెలిచిన తర్వాత హోదా ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని కోరారు. టిడిపి నాయకులు డబ్బా ఈరన్న, రామన్న గౌడ్, సోమన్న, విశ్వనాథ్, సత్యారెడ్డి, కురువ వీరేష్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సురేంద్రారెడ్డి, మణికంఠ, సలీం, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

పీఠాధిపతులుకు హెలిక్యాప్టర్ విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులుకు శ్రీఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ అనే భక్తుడు హెలిక్యాప్టర్ విరాళంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, మైసూరు జాతీయ రహదారిపై ఉన్న రాంనగర్‌కు చెందిన సురేష్ శ్రీఫౌండేషన్ ఆధ్వర్యంలో 253 అడుగుల రాఘవేంద్రస్వామి ప్రతిమను తన 4 ఎకరాల పొలంలో రూ.300 కోట్లతో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి పీఠాధిపతులను ఆహ్వానించినట్లు తెలిపారు. పీఠాధిపతుల ఆధ్యాత్మిక పర్యటనలకు వాహనంలో సుదూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల సమయంతో పాటు శ్రమ పడాల్సి వస్తుందని, త్వరగా చేరుకునేందుకు తన వంతు సహాయంగా హెలిక్యాప్టర్‌ను విరాళంగా అందిస్తున్నట్లు చెప్పారు. 253 అడుగుల రాఘవేంద్రస్వామి ప్రతిమ ఏర్పాటు చేసేందుకు భూమి పూజకు వచ్చేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. త్వరలో హెలిప్యాడ్ గ్రౌండ్, ఇటు రాంనగర్‌లోను, అటు మంత్రాలయంలో పూర్తి కాగానే విరాళం అందిస్తామని హామీ ఇచ్చారు.

'రక్తదానం చేసి, ప్రాణదాతలవుదాం'

ప్రజాశక్తి - ఆదోని

అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణదాతలవుదామని ఏరియా ప్రభుత్వాస్పత్రి డాక్టర్ జగదీష్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ మురళీ మోహన్ ఆధ్వర్యంలో రెడ్ రిబ్బన్ క్లబ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు సంయుక్తంగా శిబిరం నిర్వహించారు. 40 మంది ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తలసేమియా పిల్లలకు, గర్భిణులకు, ప్రమాదం జరిగి ఆపదలో ఉన్నవారికి రక్తం అందించేందుకు బ్లడ్ బ్యాంకులో నిల్వ చేసిన ఈ రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తరపున ప్రోత్సాహక బహుమతులు, ఏరియా హాస్పిటల్ తరపున సర్టిఫికెట్ అందజేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి హవాల్దర్ సుధాకర్ రెడ్డి, 28 బెటాలియన్, కర్నూలు ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిఫ్, ఎన్‌సిసి అధికారులు, లెఫ్టినెంట్ గోవిందు, లెఫ్టినెంట్ ఈరమ్మ, అధ్యాపకులు డాక్టర్ నళిని, లక్ష్మణ్, సతీష్ పాల్గొన్నారు.

మంత్రాలయం గడ్డపై టిడిపి జెండా ఎగురవేస్తాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే ఎన్నికల్లో మంత్రాలయం గడ్డపై టిడిపి జెండాను ఎగురవేస్తామని టిడిపి సీనియర్ నాయకులు గోతుల దొడ్డి ఉల్లిగయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిపై గెలిచే సత్తా బీసీ నాయకులకు ఉందన్నారు. బాల నాగిరెడ్డిపై ఏ నాయకుడు కూడా గెలవలేరని, మంత్రాలయం టికెట్టు బీసీలకు ఇస్తే బీసీ నాయకుల సత్తా ఏమిటో 2024 ఎన్నికల్లో చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 20 రోజుల్లో బీసీ నాయకులకు శుభవార్త ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తుంగభద్ర నదీతీరంలో లక్ష దీపోత్సవం, తుంగా హారతి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో తుంగభద్ర నదీతీరంలో లక్ష దీపోత్సవం, తుంగా హారతి నిర్వహించారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీమఠం నుంచి ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులును పల్లకిలో ఊరేగించి తుంగభద్ర నదీతీరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు తుంగభద్ర నదిలో గంగమ్మ దేవికి పసుపు, కుంకుమ, చీర, రవికతో పాటు ఫల పుష్పాల సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం వేదిక చేసుకున్నారు. దాసవాణి కార్యక్రమంలో భాగంగా శ్రీమఠం ఉద్యోగి సంప్రతి మోహన్ పాడిన పాటలు భక్తులకు వీనులవిందు చేశాయి. పీఠాధిపతులు మాట్లాడుతూ... తుంగ, భద్ర అనే రెండు నదులు ప్రవహించి ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పి పంట పొలాలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, సిబ్బంది భీమాచార్, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, కిరణ్ బాబు పాల్గొన్నారు.

తుంగా హారతిలో పాల్గొన్న వేద పండితులు

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమిని భక్తుల సమక్షంలో కనుల పండువగా నిర్వహించారు. పాలక మండలి అధ్యక్షులు నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో సహస్ర దీపారాధన నిర్వహించారు. పాలకమండలి సభ్యులు, భక్తులు, దేవాలయ సిబ్బంది దీపాలను వెలిగించారు. ఛైర్మన్ నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ... కార్తీక మాసం సందర్భంగా ప్రజల జీవితాల్లో వెలుగు కాంతులు నింపాలని ఆకాంక్షించారు. సూపరింటెండెంట్లు మల్లికార్జున, వెంకటేష్, రామ్మోహన్, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, ఈరన్న స్వామి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సాయిబాబా మందిరంలో నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా మందిర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయి సేవకులు రంగస్వామి, గాదిలింగ, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

ఉరుకుందలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైసిపి పాలనపై విసుగు చెంది రాజీనామా...

- వైసిపికి గుడ్‌బై చెప్పిన జిల్లా సీనియర్ నాయకులు మాధవరం రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి

- టిడిపిలోకి ఆహ్వానానికి అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో అవినీతి, అక్రమ కేసులు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయిందని, విసుగు చెంది వైసిపికి రాజీనామా చేసినట్లు కెడిసిసి మాజీ ఛైర్మన్, కీర్తిశేషులు రామిరెడ్డి కుమారులు రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తెలిపారు. వైసిపికి గుడ్‌బై చెప్పి త్వరలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలోని వారి స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కష్టాలు వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో సాగు, తాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లు, మురుగు కాలువలు, ఆర్‌అండ్‌బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. రాజధాని లేని ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనే నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పొందడం ఖాయమని జోస్యం చెప్పారు. త్వరలో టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు సమక్షంలో టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. టిడిపిలో చేరేందుకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉందని తెలిపారు. నియోజకవర్గంలో నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేసిందేమీ లేదని, ఆర్‌డిఎస్ కుడి కాలువ, పులికనుమ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. టిడిపి నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో దిగేందుకు అధిష్టానం ఆమోదం తెలిపిందని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టిఆర్, బాలకృష్ణ, జనసేన నాయకులు తమ వెంట నడిచే ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గం నుంచి టిడిపిలో చేరేందుకు దాదాపు 500 వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. టిడిపిలో చేరిన వెంటనే చంద్రబాబు ప్రకటించిన తొలి హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన నాయకులతో సమన్వయం చేసుకుంటూ మంత్రాలయం గడ్డపై టిడిపి జెండాను ఎగరవేస్తామని తెలిపారు. యువనేత నారా లోకేష్ చేపట్టే యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అవినీతి పరులను టిడిపిలో చేర్చుకోకుండా అడ్డుకుంటాం

- నియోజకవర్గంలో టిడిపి నుంచి తిక్కా రెడ్డి తప్ప మరొకరు గెలవలేరు

- ఎమ్మెల్యే చేతిలో కీలుబొమ్మలు రామిరెడ్డి కుమారులు

- బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

అవినీతిపరులు, వైసిపి నాయకులైన కెడిసిసి మాజీ ఛైర్మన్ రామిరెడ్డి కుమారులు రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డిని టిడిపిలో చేర్చుకోకుండా అడ్డుకుంటామని టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, యువ నాయకులు కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో వారి స్వగ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీల్లో వాల్మీకి కులానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని, 'వాల్మీకుల తరపున మాకే టిడిపి టికెట్ వస్తుంది. మాకు మద్దతు ఇవ్వాల'ని ప్రచారం చేసుకుంటున్న రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియదని విమర్శించారు. వారిని ఎవరూ నమ్మరని పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పాలకుర్తి తిక్కారెడ్డి మాత్రమే గెలవగలరని తెలిపారు. మాధవరంలో గొల్ల మహదేవమ్మకు చెందిన 3.50 ఎకరాల భూమిని దౌర్జన్యంగా స్టీల్ ఫ్యాక్టరీకి అమ్మి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని, బాధితులు డబ్బు అడిగితే రామిరెడ్డి కుమారులు బెదిరిస్తున్నారని చెప్పారు. మొదట వారికి డబ్బులు ఇచ్చి న్యాయం చేయాలని, లేకపోతే రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. 2014 ఎన్నికల్లో తిక్కారెడ్డి వద్ద డబ్బులు తీసుకుని టిడిపికి, తిక్కారెడ్డికి వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మద్దతు ఇచ్చిన విషయం ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. మాధవరం సర్కిల్‌లో టిడిపి జెండాకు వైసిపి రంగు వేసినప్పుడు టిడిపిపై అభిమానం ఉన్న మీరెందుకు ఊరుకున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేతిలో కీలుబొమ్మగా ఉంటూ ఆయన ఆటలో పావుగా మారారని తెలిపారు. 2019 ఎన్నికల్లో బుల్లెట్ వల్ల గాయాలైనా, ఆరోగ్యం సహకరించకపోయినా నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగినప్పుడు తిక్కారెడ్డి స్పందించి కాపాడుకున్నారని చెప్పారు. మీరు వైసిపిలో చేరి పదవులు అనుభవించి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మాధవరంలో తమ కుటుంబ సభ్యులపైనా, తమపైనా, తమ కార్యకర్తలపైనా దాడులు చేయించారని తెలిపారు. అక్రమ కేసులు, రౌడీషీట్లు ఓపెన్ చేయించారని చెప్పారు. మాధవరం, రచ్చుమర్రి, సూగూరు గ్రామాల్లో తక్కువ ధరకు భూములు కొని ఫ్యాక్టరీకి ఎక్కువ ధరకు అమ్ముకొని రైతులను మోసడం చేశారని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తులకు చంద్రబాబు నాయుడు టిడిపి టికెట్ ఎలా ఇస్తారని అనుమానం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పాలకుర్తి తిక్కారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. బీసీ సెల్ కార్యదర్శి రాజశేఖర్, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయికుమార్ రెడ్డి, సూరి, ముత్తు, నరసింహులు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రారంభోత్సవాలపైనే ఎమ్మెల్యేకు శ్రద్ధ

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జనసేన ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో పూర్తికాని ప్రభుత్వాస్పత్రుల ప్రారంభోత్సవాలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్యం అందించడంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి లేకపోవడం విచారకరమని జనసేన నాయకులు రాజశేఖర్, తాహేర్ వలీ, పులి రాజు విమర్శించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోనిలోని ఏరియా ఆస్పత్రి, మాతా శిశు ఆస్పత్రి నూతన భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన ఎలా ప్రారంభించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాతా శిశు ఆస్పత్రిలో మహిళలకు రోజూ స్కానింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. 24 గంటలూ కాన్పులు జరిగే విధంగా వైద్యులను, వైద్య పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సిటి స్కానింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని, ఈసీజీ, వెంటిలేటర్ సిబ్బందిని నియమించాలని కోరారు. నిర్మాణాలను వేగవంతం చేసి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. జనసేన నాయకులు రాజశేఖర్, మహేష్, రాకేష్, శ్యామ్, అయ్యప్ప, వెంకటేష్, గోవిందు, రాము, వెంకట రాముడు, తిమ్మప్ప, అజయ్, శ్రీనివాస్, ఎల్లప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న నాయకులు

రంగయ్య వెంటే రాయలసీమ మాలలు

- రంగయ్యపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

- మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య వెంటే రాయలసీమ మాలలు ఉంటారని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు మాల పరమేష్, సీనియర్ నాయకులు రాజోలప్ప, మురవణి తిక్కయ్య తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులుగా రంగయ్య బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి జిల్లాలను, రాయలసీమ ప్రాంతంలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో కులాలకు అతీతంగా ముందుకు పోతున్నారన్నారు. రంగయ్యను బాధ్యతల నుంచి తప్పించినట్లు కొందరు సోషల్ మీడియాలో పుకార్లు వైరల్ చేయడం తగదన్నారు. ఒకవేళ జూపూడి గ్రూపు నాయకులు రంగయ్యను బాధ్యతల నుంచి తప్పిస్తే జూపూడి గ్రూపునకు రాయలసీమ మాలలంతా దూరం కావాల్సి ఉంటుందని తెలిపారు. అవసరమైతే జూపూడి గ్రూపును బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. ప్రజల కోసం పనిచేసే రంగయ్య వెంటే ఉంటామని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. గంజిళ్ల చిన్న రంగన్న, మాలపేటయ్య, దైవందిన్నె జమ్మన్న, యువదళం జిల్లా అధ్యక్షులు గుడికల్లు నల్లన్న, యువదళ సెక్రటరీ రాముడు, బలరాముడు, మల్కాపురం వీరేష్, అంజనప్ప, నల్లా రెడ్డి, గంజిళ్ల నరసింహులు, కడివెల్ల నాగరాజు, ఉసేని, నరసింహులు, డి.నరసింహులు, అగ్రహారం ముని, కడిమెట్ల శీను, వీరాంజి పాల్గొన్నారు.

రంగయ్యకు సంఘీభావం తెలుపుతున్న మాలలు

టిడిపి హయాంలో అభివృద్ధికి పెద్దపీట

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని టిడిపి నాయకులు రంగన్న తెలిపారు. సోమవారం పట్టణంలోని 42వ వార్డు హనుమాన్ నగర్ ప్రాంతంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి మేనిఫెస్టో, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడారు. వైసిపి పాలనలో కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుతోందని, టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరిగేలా ప్రణాళిక రచించారని తెలిపారు. నాయకులు మహానంది ఉన్నారు. **నందవరం**లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా టిడిపి యువ నాయకులు గురు రాజారావు దేశాయి ఎస్సీ కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచి రామన్న గౌడ్, కె.శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గురురాజా రావు దేశాయి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో దళిత రామాంజనేయులు గుడిసె సోమవారం విద్యుదాఘాతానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఆ కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యా సంస్థ కరస్పాండెంట్ రఘునాథ్, ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కుటుంబాన్ని ఆదుకోవడానికి గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, గ్రామ ప్రముఖులు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

CHANGE OF NAME

I, **SHAIK AAFREEN**, C/o. Shaik Noushad Basha, H.No: 16-91, Khadakpura, Kurnool Mandal & Dist., Pin: 518001, A.P. That my name has been mentioned as **SHAIK AAFREEN** in my Aadhar card no: **3917 3388 1794** and my PASSPORT No: **T4189607** my name mentioned as **AAFREEN** instead of **SHAIK AAFREEN** as in my Aadhar Card. Hence forth I am being called as **SHAIK AAFREEN** for all purposes.



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి

రాజకీయ వలసలు ఆరంభం

- శ్రీశైలంలో నియోజవకర్గంలో ఇరు పార్టీల్లో చేరికలు
- పోటాపోటీగా వైసిపి, టిడిపి నేతల ఆహ్వానాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలో అప్పుడే రాజకీయ వలసల వేడి ప్రారంభమయింది. టిడిపి, వైసిపి నేతలు పోటాపోటీగా కార్యకర్తలను ఆహ్వానిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదు నెలలు ఉండంగానే శ్రీశైలం నియోజక వర్గంలో రాజకీయాల చర్చ మొదలయింది. సాధారణంగా ఎన్నికల తేదీని ప్రకటించిన తర్వాత వలస రాజకీయాలు ఉంటాయి. అయితే శ్రీశైలం నియోజక వర్గంలో మాత్రమే అప్పుడే ప్రారంభ మయ్యాయి. ప్రధానంగా అధికార పక్షం పార్టీలోకి వలసలు ఎక్కువగా ఉంటాయి. కానీ అందుకు విరుద్ధంగా ప్రతిపక్ష పార్టీ టిడిపిలోకి ఇప్పటి నుండే వలసలు ప్రారంభమయ్యాయి. నియోజవర్గంలో శ్రీశైలం, సున్నిపెంట, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూర్, మహానంది మండలాల్లో వలసల ప్రక్రియ ప్రారంభమయింది. వైసిపికి చెందిన నాయకులు టిడిపి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్నారు. చేరికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రాబోవు రోజుల్లో వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు మరింత పెద్ద ఎత్తున టిడిపిలో చేరుతారని, చేతనైతే వారిని ఆపుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి సవాల్ చేశారు. ఆత్మకూరు మండలంలో కరివేన గ్రామానికి చెందిన వైసిపి యువజన నాయకుడు దినకర రావు, వైసిపి వాణిజ్య నియోజకవర్గ నాయకులు రవి ప్రసాద్‌లు అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. మండలంలోని పలు గ్రామాలలో వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు కొందరు టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అయితే నియోజవర్గంలో టిడిపికి చెందిన కార్యకర్తలు కూడా వైసిపిలో అక్కడక్కడ చేరుతున్నారు. టిడిపి కార్యకర్తలను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రకటించారు. వారంలో రెండు చోట్ల చేరికల కార్యక్రమాలను నిర్వహించుకునేలా టిడిపి ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నది. అసెంబ్లీ ఎన్నికల నాటికి టిడిపి తన బలాన్ని పెంచుకునే విధంగా గ్రౌండ్ వర్క్‌ను చేస్తుంది. వైసిపి చెందిన నాయకులు కూడా వలసలను ప్రోత్సహించే విధంగా, టిడిపి వారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే నాయకుల వలసలు ఊపందుకోవడంతో రాజకీయ వేడి రగులు కుంటోంది. వైసిపి నాయకులు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ తమ పార్టీ బలం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ టిడిపి నేతలు వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ, చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో వివరాలు వివరిస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు ముందకు సాగు తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో వలసలు ఇరు పార్టీలోకి పెరుగుతున్న నేపథ్యంలో అప్పుడే ఎన్నికల వాతావరణం మొదలైందా అన్నట్లు పరిస్థితులు ఉన్నాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

సవరణలకు పక్కా రికార్డులుండాలి

- పారదర్శకతతో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి
- ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు సంబంధించి పక్కా రికార్డులు నిర్వహించాలని ఎలక్టోరల్ అబ్జర్వర్, ఏపిఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌తో కలిసి ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓ, ఎఈఆర్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పక వంద శాతం పాటిస్తూ ప్రొసీజర్ ప్రకారం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితాలో కరెక్టే ఉన్నప్పటికీ ప్రొసీజర్ ఫాలో కాకపోవడం వల్ల ఇటీవల ఇద్దరు అధికారులను కూడా సస్పెండ్ చేశామన్నారు. రోల్ అబ్జర్వర్‌గా తాను రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఈఆర్ఓ, ఎఈఆర్ఓలతో మొదటి సమావేశం నిర్వహిస్తున్నానని, వచ్చే సమావేశాలలో క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తానని చెప్పారు. వచ్చిన క్లెయిమ్స్ అన్నింటినీ పెండింగ్ లేకుండా క్లియర్ చేసుకోవాలని ఆదేశించారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలో నమోదుకు సంబంధించి 100, తొలగింపులు 100, చేర్పులు, మార్పులు 50 క్లెయిమ్స్‌ను ర్యాండముగా తనిఖీ చేస్తానన్నారు. పక్కా డాక్యుమెంటేషన్ లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పారదర్శకమైన తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, నమోదుపై సాధారణ రీతిలో నోటి మాటగా కాకుండా నిర్దిష్టమైన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పుడు సమాచారం, ఫిర్యాదులు అందిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెత్ ఓటర్స్ ఉంటే సంబంధిత వ్యక్తుల సమాచారం ఇస్తే పంచనామా నిర్వహించి ఓటర్ల జాబితా నుండి తొలగిస్తామన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా జనాభా, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్లు, ఈపీ రేషియో, జెండర్ రేషియో 18-19 సంవత్సరాల యువ ఓటర్లు, పిడబ్ల్యుడి ఓటర్స్ తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్‌కు వివరించారు. వైసిపి తరపున అమృతరాజ్, టిడిపి శివరామిరెడ్డి, సిపిఎం నరసింహ, కాంగ్రెస్ పార్టీ సయ్యద్ రియాజ్ తదితరులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో డెత్ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల తొలగింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాంటి వివరాలు ఉంటే ఆధారాలతో నివేదిక ఇవ్వాలని అబ్జర్వర్ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్

- ఎకరం వరి గడ్డి రూ. 6 వేలు
- పశు పెంపకందారులపై తీవ్ర భారం

ప్రజాశక్తి - రుద్రవరం

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పశువులకు గ్రాసం కొరత ఏర్పడింది. దీంతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. పశువుల పెంపకం చేపట్టే రైతులకు వారి గ్రామాల్లో గ్రాసం లేకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ప్రకాశం జిల్లా రైతులు, వ్యాపారులు రుద్రవరం మండలంలో పశుగ్రాసం కొనుగోలు చేసి తమ జిల్లాలకు తీసుకెళ్తున్నారు.

పొలం నుంచి గ్రాసంను రోడ్డుపైకి చేరవేస్తున్న కూలీలు

ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న పశుగ్రాసం

నంద్యాల జిల్లాలోని రుద్రవరం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు అడపాదడప కురిసిన వర్షాలకు, తెలుగంగ ప్రధాన కాలువ, బోరు బావుల కింద వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంటను రైతులు కోత కోస్తున్నారు. చిత్రేనిపల్లి, హరినగరం, ముకుందాపురం, ఆలమూరు, నరసాపురం, తిప్పారెడ్డిపల్లి, ఆర్.నాగులవరం, తిప్పారెడ్డిపల్లి, కోటకొండ, ఎల్లా వత్తుల, శ్రీరంగాపురం, చిన్న కంబలూరు, పెద్దకంబలూరు, కొండ మాయపల్లి, అప్పనపల్లి, తదితర గ్రామాలలో వరి పంట కోత కోసి రోడ్లపై ధాన్యం ఆరబెట్టారు. కోత కోసిన తర్వాత పొలంలో ఉన్న పశుగ్రాసాన్ని కర్నూలు, ప్రకాశం, జిల్లాల నుంచి రైతులు, వ్యాపారులు, వచ్చి ఎకరానికి రూ. 6 వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. వరిగడ్డిని ట్రాక్టర్ల ద్వారా ఆ ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. దీంతో పశుగ్రాసానికి మంచి డిమాండ్ ఏర్పడింది. రైతులకు కూడా ఎకరానికి రూ.6 వేలు వస్తుండడంతో ఆ డబ్బుతో వరి కోత మిషన్ ఖర్చులు కలిసి వస్తున్నాయి. పశుగ్రాసం ఇక్కడ అవసరాలకు మిగులుచుకున్న తర్వాతే రైతులు ఇతర ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్లు అరెస్టు

- 24 తులాల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్ స్వాధీనం
- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్‌పి

ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్లను అరెస్టు చేసి, వారి నుండి 24 తులాల బంగారు ఆభర ణాలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్‌కు చెందిన రాత్నవతు మోహన్ నాయక్, అలియాస్ కిషోర్ నాయక్, పేసుకారి శ్రీకాంత్‌లు మహిళలను టార్గెట్ చేసి మోటార్ బైక్ పైన వచ్చి వారి మెడలో ఉన్న చైన్ లాక్కొని వెళ్తున్నారని చెప్పారు. దొంగతనానికి పాల్పడేటప్పుడు వారి మోటార్ సైకిల్ నెంబర్ ప్లేట్ తీసివేస్తున్నారని తెలిపారు. సమాచారం మేరకు భానుముక్కల టర్నింగ్ వద్ద వారిని అరెస్టు చేసి వారి నుండి 24 తులాల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్, హెల్మెట్, మాస్క్, క్యాప్ స్వాధీనం చేసున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులపై ఆత్మకూరు సబ్ డివిజన్‌లో 4 కేసులు, కర్నూలు జిల్లాలో 4 కేసులు, తెలంగాణ రాష్ట్రంలో 2 కేసులు ఉన్నట్లు చెప్పారు. ఆత్మకూరు డిఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐ కె.నాగభూషణ్, నందికొట్కూర్ రూరల్ సీఐ విజయ్ భాస్కర్, అర్బన్ సీఐ ప్రకాష్, ఆత్మకూరు ఎస్సై డివి నారాయణ రెడ్డి, పాములపాడు ఎస్సై జి.అశోక్ వారి సిబ్బంది ప్రత్యేక టీముగా ఏర్పడి చైన్ స్నాచర్లపై నిఘా పెట్టి అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- నిర్దేశించిన 13,433 గృహాలు జనవరి 31కి పూర్తి కావాలి : కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నిరుపేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న లేఔట్లలో మెగా కంప్లీషన్ డ్రైవ్ కింద ప్రభుత్వం నిర్దేశించిన 13,433 గృహాలను వచ్చే ఏడాది జనవరి 31 నాటికి పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని విసి హాలులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగులో ఉన్న అన్ని నియోజకవర్గాల ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరై బేస్మెంట్, లెంటల్, రూఫ్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను మెగా కంప్లీషన్ డ్రైవ్ తో వేగవంతంగా పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2713, బనగానపల్లెలో 2562, డోన్‌లో 2554, నందికొట్కూరులో 1823, నంద్యాలలో 445, పాణ్యంలో 527, శ్రీశైలంలో 2809 వెరసి మొత్తం 13,433 గృహాలు వచ్చే ఏడాది జనవరి 31 నాటికి పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని రోజువారి లక్ష్యాలను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లకు అప్పగించాలన్నారు. హౌసింగ్ డీఈ, ఏఈలు, ఇతర హౌసింగ్ సిబ్బంది ప్రతిరోజు జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులను మోటివేట్ చేయాలన్నారు. ఆలస్యం చేస్తే నిర్మించుకున్న గృహాలకు కూడా బిల్లులు పెండింగ్లో ఉండే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని లబ్ధిదారుల దృష్టికి తీసుకెళ్లి గృహాలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతిరోజు గహ నిర్మాణాలను స్టేజ్ కన్వర్షేషన్ దశకు తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, అన్ని మండలాల నుండి ఎంపిడిఓలు, హౌసింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు తొలగించేందుకు దరఖాస్తు చేసిన 19 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - బనగానపల్లె

స్థానికంగా లేరని, ఓట్లు తొలగించాలని అక్రమంగా ఫారం-7లో దరఖాస్తు చేసిన 19 మందిపై ఎన్నికల అధికారి కామేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. బనగానపల్లెలో నిజంగానే దొగతనంగా ఓట్లు తీసేశారని నిర్ధారించి, ఇలాంటి తప్పులకు ఎవరు పాల్పడకూడదని హెచ్చరిస్తూ, తప్పు చేసిన 19 మంది వైసీపీ సానుభూతిపరులైన పూజారి శ్రీనివాసులు, బుసగాని వెంకటేశ్వర్లు, సురేష్ బాబుతో పాటు 16 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఎన్నికల అధికారి బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 19 మంది వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారు.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వైసిపి నాయకులు ఓటమి భయంతోనే పట్టణంలో టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు ఫారం-7లో ఓట్లను తొలగించాలని దరఖాస్తు చేసినట్లు చెప్పారు. ఒక్కొక్క వ్యక్తి ఓట్ల తొలగింపుకు ఏడు దరఖాస్తులు మాత్రమే పెట్టాలని, కానీ వైసీపీ నాయకులు ఒక్కొక్కరు 300 నుండి 400 దరఖాస్తులు ఆన్లైన్లో నమోదు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి అక్రమంగా వైసిపి నాయకులు ఓట్లు తొలగించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో పోలీసులు 19 మంది వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం పతనం అవుతుందన్న భయంతో ఇలాంటి తప్పుడు దారులకు పాలడుతున్నారని విమర్శించారు. త్వరలో ఇలాంటి అసమర్థ ప్రభుత్వానికి, నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికలలో టీడీపీ విజయం తథ్యమన్నారు.

మోడల్ స్కూల్, వసతి గృహాలకు ప్రహరీ నిర్మించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలోని ఎపి మోడల్ స్కూల్‌కు, వసతి గృహానికి ప్రహరీ గోడ నిర్మించి విద్యార్థినిలకు భద్రత కల్పించాలని కెవిపిఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉశేనమ్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ మురళీమోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మోడల్ స్కూల్లో, వసతి గృహంలో దాదాపు 600 మంది విద్యార్థినిలు ఉన్నారని, వారికి భద్రత కల్పించాలన్నారు. రాత్రి సమయాన వసతి గృహం పరిసరాల్లో ఆకతాయిలు తిరుగుతుంటారని, వారి వల్ల విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇటీవల ఈ మైదానంలో క్రీడాశిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని, నిత్యం మైదానంలో అబ్బాయిలు ఉంటారని, బాలికలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉశేనమ్మ

సాంకేతిక పేపర్ ప్రజెంటేషన్‌లో శాంతిరాం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని శాంతిరామ్ కళాశాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక పేపర్ ప్రజెంటేషన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టెక్నో బ్రెయిన్ 2కే 23 జాతీయ సాంకేతిక సదస్సులో శాంతిరాం ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులు కే.అఖిల్, ఈ.యశ్వంత్‌లు ద్వితీయ బహుమతి పొందినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన అట్మాస్ఫియర్ ఎయిర్ టు వాటర్ కన్వర్టర్ పత్రానికి ద్వితీయ బహుమతి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ఎండి శివరాం, హెచ్ఓడి డాక్టర్ మల్లికార్జున రావు, కోఆర్డినేటర్ శంకర్ నాథ్‌లు విద్యార్థులను అభినందించారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు శాంతిరాం ఫార్మసీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పాణ్యం

స్థానిక నెరవాడ సమీపంలోని శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి నితీష్ కుమార్ సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.మధుసూదన శెట్టి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.ముని శంకర్ మాట్లాడుతూ ఈనెల 16న మైపర్ కళాశాల కర్నూల్‌లో జరిగిన సౌత్ జోన్ క్రికెట్ ఎంపిక పోటీలలోబీఫార్మసీ మూడవ సంవత్సరం విద్యార్థి ఎస్.నితీష్ కుమార్ అత్యంత ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని చెపాపరు. ఎంపికైన జట్టు హిందుస్థాన్ యూనివర్సిటీ చెన్నై (తమిళనాడు)లో జరిగే సౌత్ జోన్ క్రికెట్ పోటీలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జిఎం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మిద్దె శివరాం విద్యార్థి నితీష్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఉపాధి పనుల వద్ద గుండెపోటుతో కూలీ మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. దుద్యాల గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మిద్దె వెంకటరమణ(58) ఉదయం గ్రామ శివారులో ఇస్కాల గ్రామ రహదారికి ఇరువైపులా కంప చెట్ల తొలగింపు పనులు చేసేందుకు ఉపాధి పనికి వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. గమనించిన కూలీలు అతని ఆత్మకూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుంగా కోలుకోలేక మృతి చెందాడు. వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటరమణ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు.

'ఆడుదాం-ఆంధ్రా' ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

- క్రికెట్, కబడ్డీ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో పోటీలు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమయినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో ఆడుదాం-ఆంధ్రా లోగో, మస్కట్, బ్రోచర్, ఆన్‌లైన్ ప్లేయర్స్ రిజిస్ట్రేషన్ లింక్‌ను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలు ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో వాలంటీర్ల రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామీణ, వార్డు, మండల, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ అంశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు పైబడిన ఆసక్తి కలిగిన వారు వెబ్ సైట్, యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పోటీలు 45 రోజుల పాటు 516 గ్రామ, వార్డు సచివాలయాలలో, 28 మండలాల్లో, 7 నియోజక వర్గాలలో జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అన్ని స్థాయిలలో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీస్, పతకాలు అందజేస్తామన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సచివాలయం, మండల స్థాయి విజేతలకు క్రీడా కిట్లను అందజేస్తామన్నారు. నియోజక వర్గంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు నగదు బహుమానం అందజేస్తారన్నారు. జిల్లాస్థాయి విజేతలకు బహుమతులు రూ. 60 వేలు, రూ. 30 వేలు, రూ. 10 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు రూ. 5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్‌లో నియోజకవర్గ స్థాయి విజేతలకు బహుమతులు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ. 15 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు రూ. 2 లక్షలు, రూ. 1 లక్ష, రూ.50 వేలు ఇస్తారని చెప్పారు. 15 సంవత్సరాల వయసు పైబడిన పురుషులు, మహిళలు సమీపంలోని సచివాలయంలో నమోదు చేసు కోవచ్చన్నారు. ఆన్‌లైన్ https://aadudamandhra.ap.gov.in/login ద్వారా చేసుకోవచ్చన్నారు. రిజిస్టర్ కోసం 1902కి కాల్ చేయవచ్చన్నారు. జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి వివిధ శాఖలను సమన్వయం చేస్తున్నామన్నారు. ఇందులో ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ పిఈటిలు, రవాణా శాఖ, సివిల్ సప్లై తదితర శాఖలు, వారి సిబ్బంది క్రీడల్లో సమన్వయం చేస్తారని తెలిపారు.

ప్రస్తుత రబీ పంటలకు సాగునీరివ్వలేం

- డిసెంబర్ 10 వరకే పంటలకు నీరు
- నీటిపారుదల శాఖ పర్యవేక్షిక ఇంజనీరు వెంకటరమణయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రస్తుతం రబీలో సాగు చేసుకుంటున్న పంటలకు సాగునీరు ఇవ్వలేమని నీటిపారుదల శాఖ పర్యవేక్షిక ఇంజనీరు వెంకటరమణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తెలుగు గంగ కాలువ, కెసి కాలువ, శ్రీశైలం కుడిగట్టు కాలువ ఆయకట్టు రైతులు గమనించాలని కోరారు. ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయంలోఉమ్మడి నీటిపారుదల వ్యవసాయశాఖ సలహామండలి సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో నంద్యాల జిల్లాలోని వివిధ జలాశయాలలో వున్న నీటిని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు మాత్రమే తెలుగు గంగ కాలువకు నవంబరు నెల ఆఖరు వరకు, కెసి కెనాల్‌కు డిసెంబర్ 10 వరకు, శ్రీశైలం కుడిగట్టు కాలువకు డిసెంబర్ నెలాఖరు వరకు నీరు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరం రబీ పంటకు తెలుగు గంగ కాలువ, కర్నూలు-కడప కాలువ, శ్రీశైలం కుడిగట్టు కాలువ క్రింద నీరు ఇవ్వబడదని తీర్మానించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని 14వ వార్డు పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం ఎ రషీద్ సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా సహకారంతో పట్టణ అభివృద్ధి కొనసాగిస్తున్నామని అన్నారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం ముందు ఉంటుందని వివరించారు. మున్సిపల్ ఆర్థిక 15 ఫైనాన్స్ నిధులతో రూ.5.50 లక్షల తో సిసి రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్ చౌదరి, మిట్టకందాల, మహబుతుల్లా, బోర్వెల్ రహిమాన్, పాన్ భాష, కాంట్రాక్టర్ కలిముల్లా, వైసిపి నాయకులు కుదుస్, బెస్త శ్రీనివాసులు, శాలి ఫైల్వాన్, మున్సిపల్ ఏఈ షాహిద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ నిర్వహిస్తున్న ఎంఏ రషీద్, కెపి విజయ్ చౌదరి

ఆలమూరు గ్రామంలో గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో సర్పంచి పాణ్యం లక్ష్మీదేవి, వైసిపి మండల కన్వీనర్ పాణ్యం నాగేష్, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహాశీల్దార్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రెండవ రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాణ్యం చంద్ర, చిన్న బాలయ్య, ఆలయ చైర్మన్ ప్రభాకర్ రామిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

30న మరకత లింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లి అర్ఎస్ గ్రామంలోని గంగా గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామికి కార్తీక మాసం సందర్భంగామ ఈ నెల 30న ఘనంగా అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.మస్తాన్ రావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్షేత్రం నందు నవగ్రహ ఆలయ సముదాయంలో మరకత లింగేశ్వర స్వామికి జరగబోయే అన్నాభిషేకం కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విఆర్ఒ ఆదిలక్ష్మి మృతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని లింగమయ్య వీధిలో ఉన్న 8వ సచివాలయంలో వీఆర్వోగా పని చేస్తున్న ఆదిలక్ష్మి ఈనెల 17న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాలలోని ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కోలుకోలేక సోమవారం మృతి చెందారు. ఆమె మరణం పట్ల వీఆర్వోల సంఘం, ఆళ్లగడ్డ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలస్వామి సంతాపం వ్యక్తం చేశారు. ఆదిలక్ష్మి అంతక్రియలు ఆమె స్వగ్రామం చాగలమర్రి మండలం చిన్న వంగలిలో మంగళవారం జరుగుతాయని బాలస్వామి తెలిపారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని రామరత్నగిరి గ్రామానికి చెందిన బెస్త నడిపి రంగస్వామి ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగల గొట్టి సుమారు 6 తులాల బంగారు, 50 వేల రూపాయలు ఎత్తుకెళ్లారు. బాధితడి ఫిర్యాదు మేరకు జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నంద్యాల నుండి క్లూస్ టీం వచ్చి ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు.

పెద్దమ్మ అన్నదాన సత్రానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన బూజూటి వెంకటసుబ్బారెడ్డి, ఆయన ధర్మపత్ని వెంకటసుబ్బమ్మ, కుమారులు గంగాధర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి రూ.50,116 గదును విరాళంగా ఇచ్చినట్లు కమిటీ కార్యదర్శి రామ గంగిరెడ్డి తెలిపారు.

శ్రీగిరిపై పోటెత్తిన భక్తజనం

- మూడు రోజులుగా కొనసాగుతున్న రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీగిరిపై పోటెత్తిన భక్తజనంతో శ్రీశైలం ప్రధాన వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. కార్తీక మాసంలో రెండవ శనివారం, ఆదివారం, సోమవారాలతోపాటు పౌర్ణమి, ఆదివారం, సోమవారాలలో ఉండడం, అలాగే సెలవు రోజులు కావడంతో పాటు కార్తీక సోమవారం సందర్భంగా విద్యాసంస్థలన్నీ కూడా సెలవు ప్రకటించడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో మహాశివరాత్రిని తలపించేలా తరలివచ్చారు. చలి తీవ్రత పెరిగినప్పటికీ లెక్కచేయకుండా తెల్లవారుజామున నాలుగు గంటల నుండి పాతాళ గంగలో స్నానాల గురించి స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. స్పర్శ దర్శనం, ఆర్జిత సేవలు,

పాతాళగంగలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అభిషేకాలు నిలిపివేయడం వలన భక్తులు శీఘ్ర, అతి శీఘ్ర, ఉచిత క్యూలైన్లలో వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు ఉచితంగా మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేస్తున్నారు. పరిపాలన భవనంలో పని చేసే సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. లడ్డు ప్రసాదాలు భక్తులు అడిగినన్ని ఇచ్చేందుకు అధికంగా తయారు చేయించారు. ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు నిరంతరం క్షేత్ర పరిధిలో పర్యవేక్షిస్తూ ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. ఆలయానికి ఈశాన్య భాగంలో ఉన్న పుష్కరిణిలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో పుష్కరిణి వద్దకు సంప్రదాయం ప్రకారం తీసుకువచ్చారు. అనంతరం లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం : శ్రీశైలం క్షేత్రంలోని అన్న ప్రసాద పథకానికి హైద్రాబాద్‌కు చెందిన టి.శ్రీకాంత్ కుటుంబ సభ్యులు రూ. 2 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని అన్నప్రసాద వితరణ పర్యవేక్షకులు సి. మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఓంకార క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

బండి ఆత్మకూరు : నల్లమల అభయారణ్యంలో వెలసిన గంగ ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయానికి రెండవ కార్తీక సోమవారం, పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే మహిళలు కార్తీక దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున జాగారం చేయడానికి ఆలయానికి తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం నీటి వసతి ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఆలయ అధికారి నాగప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ పరిసరాల్లో భారీ బందోబస్తు బండి ఆత్మకూరు ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులకు ఆర్యవైశ్య అన్నసత్రం, కాశిరెడ్డి నాయన నిత్య అన్నదాన సత్రంలో భోజన సదుపాయాలు కల్పించారు. ఓంకార సిద్దేశ్వరుని దర్శించుకున్న భక్తులు కొండపై ఉన్న వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

బండి ఆత్మకూరు : ఓంకార క్షేత్రంలో క్యూలో నిల్చున్న భక్తులు

టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎన్‌ఎండి.ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టిడిపి నంద్యాల నియోజకవర్గానికి నూతన ఇన్చార్జిగా ఎన్.ఎండి.ఫరూక్‌ను నియామిస్తూ పార్టీ అధిష్టానం సోమవారం ప్రకటన విడుదల చేసింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా ఎన్ఎండి.ఫరూక్‌ని నియమించిన్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గాన్ని ముస్లింలకు కేటాయించేలా టిడిపి అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఆ నేపథ్యంలోనే నంద్యాల అసెబ్లీ నియోజకవర్గం సీటు ఎన్ఎండి ఫరూక్‌కు కేటాయించినట్లు మైనార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్ఎండి ఫరూక్‌కు సీటు కేటాయించడంతో గత రెండు రోజులుగా భూమా బ్రహ్మానంద రెడ్డి తన అనుచరులతో, టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్ణయిస్తూ తన రాజకీయ భవిష్యత్‌పై కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన వర్గీయల్లో చర్చ జరుగుతుంది.

ఫరూక్ అభిమానులు, శ్రేయోభిలాషుల సంబరాలు : టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జీగా మాజీ మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌ను అధిష్టానం నిర్ణయించడంతో ఖలీల్ థియేటర్ వద్ద అభిమానులు టపాకాయలు కాల్చి, కేక్ తినిపించి సంబరాలు చేసుకున్నారు. మాజీ మంత్రి ఫరూక్‌కు, ఎన్ఎండి ఫిరోజ్‌కు మాజీ కౌన్సిలర్, డి రవి కుమార్, పిల్లి వెంకటేశ్వర్లు, మిద్దె హుస్సేన్, ఉప్పరి సురేష్ అభినందనలు తెలిపారు.

ఎన్ఎండి ఫరూక్‌కు కేక్ తినిపిస్తున్న అభిమానులు

బిఇడి కళాశాలల గోల్ మాల్‌పై విచారణ జరపాలి

- రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జెఎసి

ప్రజాశక్తి - నంద్యాల

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ బిఇడి కళాశాలల విద్యార్థులకు బ్లాక్ టీచింగ్, ప్రాక్టికల్స్ నిర్వహించుకోవడానికి విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారని, అయితే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో జిల్లాలోని కొంతమంది ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుమ్మక్కై ఎటువంటి బ్లాక్ టీచింగ్ నిర్వహించకపోయినా, ప్రాక్టికల్స్ జరపకపోయినా జరిపినట్లు నివేదికలు ఇస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ, విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నేతలు రామినేని రాజునాయుడు, బందెల ఓబులేసు, షేక్ రియాజ్, అబ్దుల్ ఖాదర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం స్థానిక జెఎసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా ఈ సమస్యపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఇలాంటి తప్పిదాలకు పాల్పడిన కొంతమంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలపై చర్యలు తీసుకొని, అందుకు భాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ బీఈడీ కాలేజీలపై విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేసి, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

విద్యుత్ అధికారులను సన్మానిస్తున్న సర్పంచి మేకల భాగ్యమ్మ తదితరులు

ఎస్‌సి కాలనీలో 100 కెవి ట్రాన్స్‌ఫారం ఏర్పాటు

- విద్యుత్ అధికారులను సన్మానించిన సర్పంచి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడులోని ఎస్సీ కాలనీలో గత కొంతకాలంగా లో వోల్టేజ్ సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉండేది. విద్యుత్తు శాఖ ఏఈ అబ్దుల్ ఆబీజ్ సిబ్బందితో కలిసి ఎస్సీ కాలనీలో పాత ట్రాన్సఫర్‌ని తొలగించి 100 కేవీ ట్రాన్సఫర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఏఈ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో ఇక లో వోల్టేజ్ సమస్య ఉండదని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. సమస్య పరిష్కరించినందుకు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, భర్త మేకల భాస్కర్‌లు ఏఈ అబ్దుల్ అబీజ్‌ను, లైన్‌ఇన్స్పెక్టర్ శ్రీనివాసులును, లైన్మెన్ నాగిరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల నగర పంచాయతీలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేయడంతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం కమిషనర్ రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ఆయా కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి టెండర్లు వేసి అందుకు సరైన విధంగా అభివద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే దుర్గాపేట, కోటపేట, బిఆర్ పేట కాలనీలలో ప్రజల దాహార్తి కోసం ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. జనవరి నెల లోపల తాగునీటి సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుందని చెప్పారు. పట్టణంలోని సంజీవ్ నగర్ హనుమాన్ నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను కూడా ఏర్పాటు చేయడానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రైల్వే అధికారులతో చర్చించారని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనుల కోసం టెండర్లు వేసిన సందర్భంగా ఈ ఖర్చుల నిమిత్తం మున్సిపల్ ఇంజనీర్ అంచనా వేసి కౌన్సిలర్ల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఇబ్రహీం, కోట్ల మధు, నంద్యాల కుమారి, రామ్ గోపాల్, ఆంజనేయులు, నాగజ్యోతి, ముబీనా, హుస్సేన్ బి, చింతల నాగిరెడ్డి, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ చలం రెడ్డి

ఆర్‌బికె పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

తాగునీటి ట్యాంకును పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - మిడుతూరు : మండలంలోని వీపనగండ్ల గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి ట్యాంకును ఎంపిడిఒ జీవన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భారతి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ట్యాంకు శిథిలావస్థలో ఉందని, నీళ్ల లీకేజీ అవుతున్నాయని, కొత్త ట్యాంక్‌ని నిర్మించాలని ఎంపిడిఒను కోరారు. అనంతరం ఎంపిడిఒ గ్రామంలో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, సచివాలయం పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కెవికెలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు యూనిటీ హెడ్, సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాప్ రెడ్డిలు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ లో నందు డేటా ఎంట్రీ ఆపరేటర్ (కంప్యూటర్స్ శిక్షణ) నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసై 18 నుండి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు వివరాలకు 6303244165, 9705998056 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని బందార్లపల్లె గ్రామ సమీపంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేల బెలుం మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అనంతపురం జిల్లా పుట్లూరు మండలంకు చెందిన భూమి రెడ్డి గారి జ్ఞాపకం భూమిరెడ్డి రామాంజనేయులు రెడ్డి, భూమిరెడ్డి నాగార్జున రెడ్డిలు ఇచ్చిన రూ. 3 లక్షలు విరాళంతో దేవస్థానం ఆవరణంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. తాడిపత్రి పట్టణం చెందిన పి.రామ మోహన రెడ్డి గుడి అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. అవుకు మండల చనుగొండ్ల గ్రామానికి చెందిన బాచం సత్య నారాయరెడ్డి కుమారులు బాచం నాగేశ్వర రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వీరభద్రా రెడ్డి (మహీంద్ర ట్రాక్టర్ డీలర్స్) రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నేల బెలుం క్షేత్రానికి చేరుకొని ఆలయ కమిటీ చైర్మన్ బాల వెంకటరెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని డి. హాసిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వై సాలిహ బేగం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ నెల 24, 25, 26 తేదీలలో పుంగనూరు నియోజకవర్గ చౌడేపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి 67వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో కర్నూలు జిల్లా జట్టు కెప్టెన్‌గా డి.హాసిని ప్రతిభ చాటడడంతో లీగ్ స్థాయిలో నెల్లూరు, విశాఖ జిల్లాల పై విజయం సాధించి క్వాటర్ ఫైనల్లో విజయనగరంపై విజయం సాధించినట్లు తెలిపారు. సెమీఫైనల్‌లో హోమ్ టీమ్ అయిన చిత్తూరు జిల్లా జట్టు చేతిలో ఓటమి చెందారని తెలిపారు. డి. హాసిని కనపరిచిన ప్రతిభతో రాష్ట్ర కబడ్డీ జట్టులో చోటు సంపాదించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డి.హాసినిని కళాశాల ప్రిన్సిపల్ వై.సాలిహ బేగం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన హాసిని

అయ్యప్ప మాలధారులకు జడ్పిటిసి భిక్ష

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో అయ్యప్ప స్వామి, శివ స్వామి మాలధారులకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద జడ్పిటిసి తన ఇద్దరు కుమారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులకు భిక్షను ఏర్పాటు చేసి వారు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తన భర్త దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి మాలధారులకు ప్రత్యేక అన్నదానం చేసేవారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నేడు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చల్లా రామేశ్వర్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భోజనాన్ని వడ్డిస్తున్న జడ్పిటిసి

35వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం 35వ వార్డు సలీం నగర్‌లో రూ. 1 కోటి 14 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, వైసిపి ముస్లిం మైనారిటీ రాష్ట్ర సలహాదారుడు అబిబుల్లా, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, శిల్పా మహిళా సహకార్ చైర్మన్ నాగిని రవి సింగారెడ్డిలు సోమవారం ప్రారంభించారు. అలాగే రూ. 38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్ట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 35 వేల నుండి 45 వేల మంది ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలోని 35వ వార్డులో దాదాపు 4 కోట్ల 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపేందుకు సంతోషిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషా వలి, మున్సిపల్ కమిషనర్ రవి చంద్ర రెడ్డి, కౌన్సిలర్ భాషిద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, నంద్యాల పట్టణ అధ్యక్షులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, పున్న శేషయ్య, జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జులు, నాయకులు పైలట్, కార్పెంటర్ మౌలాలి, ఏకే ఖాన్, రెహమాన్, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

15 నుండి 'ఆడుదాం- ఆంధ్రా' : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాములపాడు

డిసెంబర్ 15 నుండి జనవరి 26 వరకు 'ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 'ఆడుదాం–ఆంధ్రా లోగోను, మస్కట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద టోర్నమెంట్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. 15 ఏళ్లకు పైబడిన బాలబాలికలకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొనేందుకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయిందని అన్నారు. క్రీడాకారులు ప్రత్యేకంగా ప్రభుత్వం ఇచ్చిన వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ పోటీలు సచివాలయం స్థాయిలో డిసెంబర్ 15 నుండి 20 వరకు, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వరకు, నియోజవర్గ స్థాయిలో జనవరి 5 నుండి జనవరి 10 వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21వరకు, రాష్ట్ర స్థాయిలో 22 నుండి 26 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడల్లో ఆసక్తి ఉన్న గ్రామీణ యువత వినియోగించుకోవాలని కోరారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి : మాజీ మంత్రి

ప్రజాశక్తి- చాగలమర్రి

రాష్ట్రంలో రాక్షస పాలన తొలగి అభివృద్ధి బాటలో నడవాలంటే రాష్ట్ర ప్రజలు, తెలుగుదేశం కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి భూమ అఖిలప్రియ తెలియజేశారు. సోమవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి ఇంటింటికి తిరుగుతూ గ్యారంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని మహిళ, నిరుద్యోగ యువత,ఇతర రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం బాగుండాలంటే, మళ్లీ అభివృద్ధి బాటలో నడవాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు, నారాయణ రెడ్డి సర్పంచి మాధవి, టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు, చిన్నకేశాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బాలగుర్రప్ప, బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు, హనీఫ్, జెట్టి నాగరాజు, ముల్లా అజీమ్, ముల్లా షాబులు, ముల్లా గఫార్, ఆకుల ఇర్షాద్, నూర్ భాషా, జహీర్ , బషీర్ ,సంజీవ రాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, లక్ష్మినారాయణ రెడ్డి,రామసుబ్బయ్య,నాగేంద్ర,పెద్ద ఈశ్వర రెడ్డి, పాలషరీఫ్, చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

నందికొట్కూరు : మండలంలోని బిజినవేముల గ్రామంలో యూనిటి ఇన్చార్జి కె.మద్దిలేటి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు శ్రీనివాసులు, మోతిశాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం : బిసి

బనగానపల్లె : గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి విమర్శించారు. సోమవారం కోవెలకుంట్ల మండలం కంపమళ్ళ గ్రామంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ ప్రజావేదిక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు మాజీ ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు కనెక్టింగ్ రహదారులు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజ్ వ్యవస్థ కల్పించడంలో ఎమ్మెల్యే కాటసాని దారుణంగా విఫలమయ్యా రని విమర్శించారు. ఎమ్మెల్యే కల్లబొల్లి కబుర్లు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైసిపి పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బనగానపల్లె కోటపై టిడిపి జెండాను ఎగరవేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు అమడాల మద్దిలేటి, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలిస్తే బేతంచెర్ల మండలంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ తమ సొంత నిధులతో ఇంటి స్థలాన్ని ఇచ్చి పట్టా ఇస్తామని టిడిపి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి తనయుడు గౌతమ్ రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణంలోని జెండా పేట వీధిలో టిడిపి పట్టణ కన్వీనర్ షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తిరుమలేష్ చౌదరి, నారాయణస్వామి, అంజాద్ భాష, నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

బేతంచెర్ల : కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌతంరెడ్డి